# విపశ్యన మాసపత్రిక

VOLUME : 2 NO - 2 1 MAY, 2007

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగుమాస పత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్, వనస్థలిపురం, హైదరాబాదు – 70

## "ధర్మవాణి"

*గారవో చ నివాతో చ*
*సన్తుట్ఠి చ కతఞ్ఞుతా*
*కాలేన ధమ్మస్సవనం*
*ఏతం మఙ్గలముత్తమం*
*– మఙ్గలసుత్తం*

పూజ్యనీయులను గౌరవించడం, సర్వదా వినయం కలిగి ఉండడం, సంతృప్తుడై ఉండడం, ఉపకారంపట్ల కృతజ్ఞుడై ఉండటం, ఉచిత సమయాలలో సద్ధర్మ శ్రవణం చేయడం. ఇదే ఉత్తమము, మంగళకరము.

*(గత సంచిక తరువాయి)*

## శీలవతీ గృహిణి

*(పూజ్యగురూజీ వ్రాసిన "మంగళ్ జగే గృహీ జీవన్‌మే" హిందీ పుస్తకమునకు తెలుగు అనువాదం "మంగళమయ గృహస్థ జీవితం" నుండి)*

విశాఖా!

ఏ స్త్రీలో ఈ నాలుగు విషయాలు ఉంటాయో, ఆ స్త్రీ సంసారములో ఎలాంటి ఒడిదుడుకులెదురైనా విజయమునే సాధిస్తుంది. ఈ లోక విజయపథంపై స్థిరంగా పయనిస్తుంది. మరియు లోకాన్ని ప్రసన్నం చేయగలుగుతుంది.

విశాఖా!

స్త్రీ తన కర్మాంతమునకు (శరీరముతో సంపన్నం చేయు కర్మలకు – శరీరముతో చేయబడు కర్మలకు) సమ్యక్ నిర్వాహకురాలై ఉండాలి.

తన పరిజనులను సంగ్రహ పరుచుకునేదై ఉండాలి.

తన పతి మనోభీష్టానికి అనుకూలమైన ఆచరణ గలదై ఉండాలి.

పతి సంపాదించిన ధనమును రక్షించేదై ఉండాలి.

విశాఖా! స్త్రీ తన కర్మాంతమునకు సమ్యక్ నిర్వాహకురాలెలా అవుతుంది?

తన పతికి సంబంధించిన అన్ని పనులలోనూ ఆమె దక్షత కలిగి వుంటుంది. వాటిలో ఆలస్యరహితంగా ఉంటుంది. ఆయనకు కావలసిన విషయాలలో సమయోచిత నైపుణ్యం కలిగి ఉంటుంది. వీటిని చేయడంలోను, చేయించడంలోను సమర్థత కలిగిన స్త్రీ తన కర్మాంతమును సమ్యక్ రీతిలో నిర్వహించేది అవుతుంది.

విశాఖా! స్త్రీ తన పరిజనులను సంగ్రహపరిచేదెలా అవుతుంది?

విశాఖా! స్త్రీ తన స్వామి ఇంటి పనివాళ్లు, పాలేర్లు చేసిన పనులేవో, చేయని పనులేవో తెలిసినదై ఉంటుంది. వారికి ఇవ్వవలసిన భోజనపానీయాలను వారివారి యోగ్యతనుబట్టి పంచి ఇస్తుంది.

విశాఖా! ఈ విధంగా స్త్రీ తన పరిజనులను సంగ్రహపరిచేదవుతుంది.

విశాఖా! స్త్రీ ఏ విధంగా స్వామి మనోభీష్టానికి అనుకూలమైన ఆచరణగలదై వుంటుంది.

విశాఖా ! ధర్మసహచారిణియైన స్త్రీ తన పతి ఇష్టానికి ప్రతికూలమైన ఏ పనినైనా తన ప్రాణాన్ని రక్షించుకునేందుకు కూడా చేయదు. విశాఖా! స్త్రీ ఈ విధంగా తన పతి మనోభీష్టానికి అనుకూలమైన ఆచరణ గలదవుతుంది.

విశాఖా ! స్త్రీ ఏవిధంగా పతి సంపాదనను రక్షించేదవుతుంది?

విశాఖా! స్వామి సంపాదించి తెచ్చిన ధనధాన్యాలను, బంగారాన్ని సురక్షితంగా ఉంచుతుంది. వాటివల్ల తనలో దుర్బుద్ధి పుట్టకుండా జాగ్రత్తపడుతుంది. తాను ధూర్తురాలిగా, దొంగగా, త్రాగుబోతుగా తయారయి తన పతి సంపాదనను నష్టపరచదు. విశాఖా! స్త్రీ ఈ విధంగా పతి సంపాదనను రక్షించేదవుతుంది.

విశాఖా! ఏ స్త్రీ యందు ఈ నాలుగు విషయాలుంటాయో, ఆమె ఈ లోక విజయపథంపై స్థిరంగా పయనిస్తుంది మరియు ఈ లోకాన్ని ప్రసన్నం చేయగలుగుతుంది.

విశాఖా! ఏ స్త్రీయందు ఈ క్రింది నాలుగు విషయాలుంటాయో ఆమె పరలోక విజయపథంపై స్థిరంగా పయనిస్తుంది. పరలోకాన్ని ప్రసన్నం చేస్తుంది. ఆ నాలుగు విషయాలేమిటి?

విశాఖా! స్త్రీ శ్రద్ధాసంపన్నురాలై ఉంటుంది; శీలసంపన్నురాలై ఉంటుంది; త్యాగ సంపన్నురాలై ఉంటుంది; ప్రజ్ఞాసంపన్నురాలై ఉంటుంది.

విశాఖా ! స్త్రీ శ్రద్ధాసంపన్నురాలెలా అవుతుంది ?

విశాఖా ! ఆమె శ్రద్ధావంతురాలయివుంటుంది. తథాగతుని బోధి పట్ల శ్రద్ధగలదై, "భగవానుడు, అరహంతుడు, సమ్యక్ సంబుద్ధుడు, విద్యాచరణ సంపన్నుడు, సుగతుడు, లోకవిదుడు, అనుపమానుడు, (దుష్ట) పురుషుల యొక్క దమనము చేయగల సారథి, దేవతలు మరియు మనుష్యుల శాస్త, శిక్షకుడు, బుద్ధుడు భగవానుడు" అని తెలుసుకుని శ్రద్ధాసంపన్నురాలవుతుంది.

విశాఖా ! స్త్రీ శీలసంపన్నురాలెలా అవుతుంది?

స్త్రీ ప్రాణిహింసపట్ల, దొంగతనంపట్ల, వ్యభిచారంపట్ల, మిథ్యాభాషణపట్ల, మదిర–మత్తు పదార్థముల సేవనపట్ల విరతురాలై ఉంటుంది. స్త్రీ ఈ విధంగా శీలసంపన్నురాలవుతుంది.

విశాఖా ! స్త్రీ త్యాగసంపన్నురాలెలా అవుతుంది ?

విశాఖా ! స్త్రీ త్యాగశీలియై, మద–మాత్సర్యరహితురాలై గృహవాసం చేస్తుంది. ముక్త హస్తురాలై ఉంటుంది. చేతులారా

త్యాగంచేసేదై ఉంటుంది. పరిత్యాగం చేసేదై వుంటుంది; దానమిచ్చేదై వుంటుంది. విశాఖా! ఈ విధంగా స్త్రీ త్యాగసంపన్నురాలవుతుంది.

విశాఖా ! స్త్రీ ప్రజ్ఞాసంపన్నురాలెలా అవుతుంది ?

విశాఖా ! స్త్రీ ప్రజ్ఞాసంపన్నురాలు ఎలా అవుతుందంటే, ఆమె సంవేదనల ఉదయవ్యయాలను అనుభవింపజేయునదీ, అవిద్యయొక్క ఆవరణాన్ని ఛేదించి, సమ్యక్ రూపంలో దుఃఖక్షయం చేయించునదీ అయిన ఆర్యప్రజ్ఞతో కూడినదై ఉంటుంది.

స్త్రీ ఈ విధంగా ప్రజ్ఞాసంపన్నురాలై ఉంటుంది.

విశాఖా! ఏ స్త్రీయందు ఈ నాలుగు విషయాలుంటాయో, ఆమె పరలోక విజయ మార్గపథారూఢురాలౌతుంది. పరలోకాన్ని ప్రసన్నం చేస్తుంది.

*సుసంవిహితకమ్మన్తా, సఙ్గహితపరిజ్జనా।*
*భత్తు మనాపం చరతి, సమ్భతం అనురక్ఖతి॥*

*సద్ధా సీలేన సమ్పన్నా, వదఞ్ఞూ వీతమచ్ఛరా।*
*నిచ్చం మగ్గం విసోధేతి, సోత్థానం సమ్పరాయికం॥*

*ఇచ్చేతే అట్ఠ ధమ్మా చ, యస్సా విజ్జన్తి నారియా।*
*తం పి సీలవతిం ఆహు, ధమ్మట్ఠం సచ్చవాదినిం॥*

*సోళసాకార సమ్పన్నా, అట్ఠఙ్గసుసమాగతా।*
*తాదిసీ సీలవతీ ఉపాసికా, ఉప్పజ్జతి దేవలోకం మనాపం॥*

– అఙ్గుత్తరనికాయ 3.8.49.50 ఇధలోకిక సుత్తము.

ఏ స్త్రీ కర్మాంతమును సమ్యక్ రీతిలో నిర్వహిస్తుందో, ఏ స్త్రీ తన పరిజనులను సంగ్రహపరిచేదవుతుందో, ఏ స్త్రీ తన పతి ఇచ్ఛానుకూలంగా నడుచుకుంటుందో, ఏ స్త్రీ తన స్వామి సంపాదించిన సంపదను రక్షిస్తుందో, ఏ స్త్రీ శ్రద్ధ గలదిగా, సదాచారిణిగా, ప్రజ్ఞావంతురాలుగా, త్యాగశీలిగా ఉంటుందో, ఆమె నిత్యమూ పరలోక పథమును శుద్ధిచేస్తుంది.

ఈ ప్రకారంగా ఏ స్త్రీలో ఈ ఎనిమిది విషయాలున్నాయో ఆమె ధర్మస్థిత, సత్యవాదీనారి, శీలవతి అనబడుతుంది.

## కుల-వధువునకై పది ఉపదేశాలు

బుద్ధభగవానుని కాలంలో, అతని గట్టి అనుయాయుడైన ధనంజయశ్రేష్ఠి, తన పెద్దకూతురు విశాఖ వివాహంచేసి సాగనంపేటప్పుడు ఈ మంగళప్రదమైన ఉపదేశమిచ్చాడు . దానిని పాటించి ఆమె ఎల్లప్పుడూ సుఖంగా ఉండింది.

ఈ ఉపదేశాలను ఒక్కసారిగా వినడంతో కొంత అస్పష్టంగా, కొద్దిగా తికమకగాకూడా అనిపిస్తాయి. ఈ మాటలువిని, విశాఖ మామగారైన మిగారుశ్రేష్ఠికి గూడా శంకా సందేహాలు తలెత్తాయి. కోడలు విశాఖ స్పష్టీకరణద్వారా అపార్థముగాకుండా తప్పిపోయింది.

## ఉపదేశముల స్పష్టీకరణ

**1. లోపలి నిప్పును బయటకు తీసుకువెళ్ళరాదు.**

ఎప్పుడైనా మామగారి కుటుంబంలో, ఏ వ్యక్తిలోనైనా, ఏదైనా దోషము కనిపించినా లేదా ఇంట్లో ఏవైనా పరస్పర కలహాలున్నా, కోడలు దానిని ఏ బయటి వ్యక్తితోనూ చెప్పగూడదు. ఇంటినిప్పు బయటకు తీసుకుపోవడమనేది ఇంతకుమించి మరేదీ ఉండదు.

**2. బయటి నిప్పును లోపలికి తేగూడదు.**

ఇరుగు-పొరుగువారెవరైనా, మామగారి కుటుంబ వ్యక్తులను నిందించినా, వాళ్ళగురించి తప్పుగా మాట్లాడినా, వాటిని ఇంటికి వచ్చి చెప్పకూడదు. బయటినిప్పు లోపలికి తీసుకురావడమనేది ఇంతకు మించి మరేదీ ఉండదు.

**3. తిరిగి ఇచ్చే వాళ్లకు మాత్రమే ఇవ్వవలెను.**

ఇంట్లో ఎప్పుడూ అవసరం ఉండే వస్తువును ఎవరైనా బదులు అడిగితే, దానిని సమయానికి తిరిగిఇచ్చే వారికి మాత్రమే ఇవ్వవలెను.

**4. తిరిగి ఇవ్వని వారికి ఇవ్వగూడదు.**

అడిగి తీసుకు వెళ్ళిన వస్తువును, మాట ప్రకారం సమయానికి తిరిగి ఇవ్వని వ్యక్తికి ఇవ్వ కూడదు.

జీవితంలో ఎన్నోసార్లు మన ఇంట్లో ఎప్పుడూ అవసరమయ్యే అతి ముఖ్యమైన వస్తువును అడిగితే ఇచ్చి, వాళ్ళు తిరిగి దాన్ని తేనప్పుడు, మనం ఆ అత్యవసర వస్తువునూ, దానితో పాటు ఆ వ్యక్తియొక్క స్నేహాన్నీ కోల్పోతాము. ఇవ్వనందువల్ల ఒక్కదాన్ని మాత్రమే పోగొట్టుకునే భయముంది. కనుక ఇవ్వక పోవడమే ఉత్తమం.

**5. తిరిగి ఇచ్చేవానికి, తిరిగి ఇవ్వని వానికి గూడా ఇవ్వవలెను.**

మన ఇంట్లోని వస్తువును తీసుకువెళ్ళి దానిని తిరిగి ఇవ్వక పోయినా మనకు గడుస్తుందన్నపుడు, అతడు ఇవ్వక పోవడాన్ని భరించే శక్తి మనకున్నపుడు, అతను ధనవంతుడయినా, పేదవాడయినా, అపరిచితుడయినా, మిత్రుడయినా, అడిగినవారికి తప్పక ఇవ్వవలెను. అతను తిరిగి ఇచ్చినా ఇవ్వక పోయినా సరే! ఈ విధంగా అవతలి వ్యక్తికి సహాయపడుతున్నామనే భావంతో ఇచ్చిన వస్తువు తిరిగి ఇవ్వబడకపోయినా మనసులో కటుత (చేదుభావం) ఉత్పన్నం కాదు.

**6. సుఖంగా కూర్చోవాలి :** ఇంట్లో అత్తమామలు, పతి, ఇతర పెద్దలు నిల్చొని ఉన్నప్పుడు కోడలు కూర్చొని ఉండడం సముచితం కాదు; సుఖకరం కాదు. అందరూ కూర్చున్న తరువాతనే ఆమె కూర్చోవడం సుఖంగా కూర్చోవడం అనబడుతుంది.

**7. సుఖంగా భుజించాలి :** ఇదేవిధంగా అందరూ భోజనం చేసిన తరువాతనే గృహిణి భోజనం చేయడం ఉచితం; అదే ఆమెకు సుఖమైన భోజనం.

**8. సుఖంగా నిద్రించవలెను :** ఇంటి పనులన్నీ ముగించుకుని, పెద్దవాళ్ళకు తగిన సేవా సపర్యలు చేసిన తరువాత, వారు పడుకొన్న తరువాతనే కోడలు నిద్రపోవడం శోభనీయము. ఇదే ఆమెకు సుఖనిద్ర.

**9. అగ్నికి పరిచర్య చేయవలెను :** పతి, అత్తమామలు మరియు పరివారంలోని ఇతర వృద్ధజనులను అగ్నిలాంటి తేజస్సుగలవారిలా భావించి సేవా శుశ్రూషలు చేయాలి.

**10. లోపలి దేవతలకు నమస్కారము చేయవలెను :** పతి, అత్తమామలు మరియు పరివారమునందు గల వృద్ధజనులను కులదేవతలలా పూజ్యులుగా తలచి, సదా వారి నమనము మరియు ఆదర సత్కారములు చేయవలెను.

– ధమ్మపదం అట్ఠకథ 1.52 విశాఖసుత్తము.

ఇవి సద్ధర్మము యొక్క మంగళప్రదమైన పది వ్యావహారిక ఉపదేశములు. ఇవి ప్రతి కులవధువుకూ మాననీయములు, సేవనీయములు మరియు పాలనీయములు. వీటిని సమ్యక్‌రీతిలో పాటించడం వల్ల ఆమె తన వ్యావహారిక జగత్తును సౌమ్యమాధుర్య ములతో పరిపూర్ణం చేయగల సహజ సమర్థతను పొందుతుంది.

## నవ వధూవరులకు ఆశీర్వచనములు

యంగోన్, మయన్మార్‌లో 10 జూలై 1967న స్వయంగా తన పుత్రుని శుభవివాహం చేసిన సందర్భంగా పూజ్య గురూజీ శ్రీ సత్యనారాయణ గోయెంకా గారు శుద్ధధర్మానుసారంగా లౌకిక సంస్కారాల ప్రతిపాదన చేశారు. నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ ఈ విధంగా ధర్మబోధ చేశారు.

**ప్రియమైన నూతన దంపతులారా!**

ఈ రోజు మీ జీవితంలో అత్యంత మహత్వపూర్ణమైనరోజు. మానవజీవితపు ప్రథమ కౌమార్యదశను పూర్తిచేసి, గృహస్థజీవనము యొక్క మజిలీలో ప్రవేశిస్తూ , మీరిద్దరూ పరస్పరం పావనమయిన దాంపత్య సూత్రంలో బద్ధులయినారు. మీ గృహస్థజీవనం సఫలమగు గాక! సార్థకమగు గాక! ధర్మమయమగు గాక!

మీ జీవితాన్ని ధర్మమయం చేసుకోటానికి ధర్మమంటే ఏమిటో తెలుసుకోవడం అత్యంత అవసరం. కర్మ, దాని పర్యవసానమయిన కర్మఫలములయొక్క నైసర్గిక నియమాలపట్ల మీరు సంపూర్ణ విశ్వాసం ఉంచి ధర్మాన్ని పాటించాలి. ధర్మమంటే మిమ్మల్నిమీరు దుష్కర్మల నుండి కాపాడుకుంటూ సత్కర్మలు చేయడమే ! **"సదాచరణమే ధర్మం, దురాచరణమే అధర్మం":**

సదాచారణలో నిరతుడై ఉండుటకు, దురాచారణ నుండి విరతుడై ఉండుటకు మనసును వశం చేసుకొనడం – అనగా సమాధి యొక్క అభ్యాసం చేయడము మరియు దానిని నిర్మలం చేసుకొనటం – అనగా ప్రజ్ఞా జాగరణ యొక్క అభ్యాసం చేయడం పూర్తిగా అనివార్యము. ఈ రెండు కూడా ధర్మం యొక్క అభిన్న అంగాలే. ఇలా శీలము, సమాధి, ప్రజ్ఞ – ఈ మూడింటిలో పరిపూర్ణ పరిశుద్ధ ధర్మం నిండి వుంది. మీరిద్దరూ వీటిని మీ జీవితంలో అలవర్చుకొని ధన్యతను పొందుతారు. అత్యంత సుఖశాంతులను, మంగళకళ్యాణాలను కలిసి అనుభవిస్తారు.

దాంపత్య సూత్రములో బద్ధులవుతూ ఏ లౌకిక ఆనవాయితీలను మీరు పాటించారో, అవి కుటుంబ, సామాజిక సామరస్యతకు మరియు లోకసంగ్రహం కొరకు తప్పనిసరై ఉండినాయి. కాని ఈ ఆనవాయితీల సద్ధర్మమయ అర్థవివరణ ఏమిటనేది తెలుసుకోండి. అప్పుడే సద్ధర్మము యొక్క సముచిత పాలన చేస్తూ పరిపూర్ణంగా లాభాన్వితులవగలుగుతారు.

**ప్రియమైన బిడ్డలారా !**

బాసికం ధరించేముందు మీ ఇద్దరికీ నలుగుపిండితో అభ్యంగన స్నానం చేయించారు. మీరిద్దరూ మంగళస్నానం చేశారు. ఎలాగైతే బాహ్యస్నానం ద్వారా మీరు మీ శరీరంపైగల మలినమును శుభ్రపరుచుకున్నారో, అలాగే విపశ్యన ద్వారా మీ చిత్తము యొక్క అభ్యాంతరిక మైలను కూడా శుద్ధి చేసుకుంటూ ఉండాలి. ఆరోగ్యవంతమైన సుఖజీవనము కొరకు శరీరమును స్వచ్ఛంగా, శుభ్రంగా ఉంచుకొనడం ఎంత అనివార్యమో, మనసును స్వచ్ఛంగా, శుభ్రంగా ఉంచుకొనడం అంతకన్నా ఎన్నో రెట్లు అధిక అనివార్యము.

**ప్రియభాషి పుత్రా !**

వివాహమండపంలో నీకు స్వాగతం పలుకుతూ మీ అత్త నీతో పంచామృతం (పాలు, పెరుగు, నెయ్యి , తేనె, చక్కెర కలిసిన మిశ్రమము) త్రాగించింది. ఆ మాధుర్యంతో నీ జిహ్వ నిండిఉండాలి. నీ వెల్లప్పుడూ మధురమైన, చెవులకింపైన, కళ్యాణకరమైన మాటలనే మాట్లాడాలి. చేదైన, అప్రియమైన, కళ్యాణకరముకాని మాటలు నీ నోట రాకుండుగాక! పంచామృతపానం యొక్క అర్థమిదే. నీవెంత ప్రియభాషివి అవుతావో, అలాగే ప్రియంవద వధువుగూడా అంతే మంజులభాషిణిగా ఉండుగాక!

**ప్రియమైన పిల్లలారా !**

వివాహవేదికపైన మీరిద్దరూ ఒకరినొకరు పరికించి చూసుకున్నారు. మీరిరువురూ బాగా చూసుకొని, ఒకరినొకరు అర్థంచేసుకుని, బయటివారినుండి ఏ ఒత్తిడీ లేకుండా, వరకట్న ప్రలోభానికి గురికాకుండా, ఒకరినొకరు స్వీకరించారు. ఇదే దీనర్థం. ఈ విషయంలో మీకు పెద్దల ఆశీర్వాదం కూడా లభించింది.

ఎప్పుడయితే వివాహవేదికపై మీ వైవాహికబంధం ముడిపడి సర్వస్వీకృతమయిందో, అప్పుడు మీరద్దిరూ జీవితాంతం ఈ దాంపత్యజీవితాన్ని కొనసాగిస్తామని దృఢంగా ప్రతిజ్ఞ చేసినవారయ్యారు.

**నా ముద్దుబిడ్డా !**

పాణిగ్రహణ సమయంలో నీ అత్తగారు పవిత్రజలంతో తన దోసిలి నింపుకుని ఈ పరమపవిత్రమయిన, ప్రాణప్రదమయిన పుత్రికను నీ జీవితభాగస్వామిగా ఇచ్చి ప్రసన్నురాలయింది. దాని అర్థం నీవు ఈ అమూల్యమైన కన్యారత్నాన్ని స్వీకరిస్తూ, ఈమెను ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమిస్తూ, ఎల్లప్పుడూ రక్షిస్తూ ఉంటానని బాధ్యత తీసుకున్నావు. కోడలిని, నీ అర్థాంగిగా, సహధర్మచారిణిగా చేసుకుని జీవితాంతం ధర్మమయ దాంపత్యజీవనం జీవించుటకు వ్రతబద్ధుడవయ్యావు. పాణిగ్రహణ సమయంలో రెండు వెండిపాత్రలనుండి జలధారలు ప్రవహింపజేయడంలోని అర్థం – ఆ రెండు పాత్రల జలధారలు ఎలా కలిసి ఒకటిగా అవిభాజ్యం, అభేద్యమవుతాయో, అలాగే మీ ఇద్దరి ఈ సంబంధమూ అవిభాజ్యమై, అభేద్యమై వుంటుందని. మీ ఇద్దరి సాత్వికమైన ప్రేమ ఎల్లకాలమూ నిర్మలమై, నిష్కళంకమై ఉండు గాక! అనుమానాలు, అపోహలు మరియు మనోమాలిన్యాల దుర్భావనలు మీ అనుబంధాన్ని దూషితం చేయకుండుగాక!

**విజ్ఞులైన నవదంపతులారా !**

మీరిద్దరూ నాలుగుసార్లు అగ్నిప్రదక్షిణ చేశారు. నాలుగుసార్లు అగ్నిచుట్టూ తిరిగారు. పృథ్వి, వాయువు, జలము మరియు అగ్ని ఈ నాలుగు మహాభూతాల సాక్షిగా మీరిద్దరు ఒకరినొకరు వరించారు. ఒకరితోఒకరు కలిసి జీవనయాత్ర పూర్తిచేయడానికి కృతసంకల్పులైనారని మరియు పరస్పర సహాయ – సహకారాలతో శీల, సమాధి, ప్రజ్ఞ, విముక్తిల యొక్క ఈ నాలుగుధర్మముల పాలనచేస్తామన్న మీ నిశ్చయం చలించనిదని దీని అర్థం. మీ ఈ

మంగళప్రదమైన నిర్ణయం ఆజీవనపర్యంతం అలాగే దృఢంగా ఉండుగాక! అత్యంత శుభఫలదాయిని అగుగాక!

**మేధావులయిన పిల్లలారా !**

ఎప్పుడయితే మీరిద్దరూ కలిసి వివాహయజ్ఞంలో "లాజా-హవనం" (నిప్పులో వేగిపడిన ధాన్యపుగింజలు-లాజాలు-పేలాలు వేస్తూ చేసే హోమం) చేశారో, దీని అర్థం ఏమంటే ఈ హోమాగ్నిలో ఈ లాజా-హవన ద్రవ్యాలు ఎలా ఆహుతై, స్వాహా అవుతున్నాయో, అలాగే మా యిద్దరి అంతః ప్రజ్ఞ అనే యజ్ఞాగ్నిలో సమస్త రాగ, ద్వేష, మోహ, మద-మాత్సర్యాలను భస్మం చేసి స్వాహా చేస్తాం. మానసిక, వాచిక, కాయిక దురాచరణలను, మిథ్యాదృష్టిని భస్మీపటలం చేస్తామని అంటున్నామని తెలుసుకోవాలి.

**నా గారాల తండ్రీ !**

కోడలిని నీవు నీ ఎడమవైపు కూర్చోమని ఆహ్వానించావు. దాని అర్థం నీ శరీరంలో ఎడమవైపునున్న హృదయంలో ఎల్లప్పుడూ ఉండేట్లుగా ఆమెను ప్రతిష్ఠిస్తున్నావని. అదేగాక పతిగా ఈ ఐదుకర్తవ్యాలనూ పాటిస్తావనీ, ఎల్లప్పుడూ ఈ దృఢప్రతిజ్ఞాబద్ధుడవై ఉంటావనిగూడా దీని అర్థం.

1. **సమ్మానానాయ -** నా భార్యను ఎల్లప్పుడూ గౌరవిస్తుంటాను.
2. **అనవమానాయ -** ఆమెనెప్పుడూ అవమానపరచక ఆవిడతో సమానంగా వ్యవహరిస్తూ దాంపత్యజీవనాన్ని సమృద్ధిగా సుఖమయం చేసుకుంటాను.
3. **అనతిచరియాయ -** వ్యభిచారం మొదలగు దురాచారాల నుండి విరతుడనై ఉండి ఆమెతో విశ్వాసపాత్రునిగా ఉంటాను.
4. **ఇస్సరియవోసగ్గేన :** నేను సంపాదించిన ధనసంపత్తి ఐశ్వర్యంతో ఎల్లప్పుడూ ఆమెను సంతుష్టురాలిగా ఉంచుతాను.
5. **అలంకారానుపాదానేన :** అవసరమయిన అలంకార ఆభరణములు మొదలయినవి సమకూరుస్తూ ఆమెను సదా ప్రసన్నురాలిని చేస్తాను.

గారాల కోడలా! పత్నియొక్క ఈ ఐదు కర్తవ్యాల పాలనచేస్తానని నువ్వు గూడా దృఢ ప్రతిజ్ఞ చేయాలి.

1. **సుసంవిహిత కమ్మన్తా చ హోతి -** ఇంటిని చక్కగా తీర్చిదిద్దాలి.
2. **సంగహిత పరిజనా చ -** పరివారంలోని స్వజనులను, పరిజనులను ఇంటి పాలేరు- పనివాళ్ళను ప్రసన్నులుగా వుండేట్లు చేసి వారిని అనుకూలంగా ఉంచుకోవాలి.
3. **అనతిచారినీ చ-** వ్యభిచారం మొదలగు అనాచారాల నుండి విరతురాలివై ఉండి నీ ప్రియపతికి విశ్వాసపాత్రురాలిగా ఉండాలి.
4. **సమ్భతం అనురక్ఖతి -** పతి శ్రమించితెచ్చిన ధనసంపదను సముచితంగా రక్షించాలి.
5. **దక్ఖా చ హోతి, అనలసా సబ్బ కిచ్చేసు -** ఇంటిఇల్లాలిగా అన్నిపనులలోను దక్షురాలివై బద్ధకంలేకుండా పనిలో నేర్పరివై ఉండాలి.

– దీఘనికాయ 3.269, సిఙ్గాలసుత్తము.

**ధర్మచారిపుత్రా!**

నీవు ధర్మప్రియ కోడలిని అర్ధాంగిగా చేసుకొంటూ ఇచ్చిన నీ వచనాలలో ఒకదాని పట్ల చాలాజాగ్రత్తగా ఉండవలెను. అదేమనగా, "జీవనపర్యంతం దాన-దక్షిణలు, శీల-సాధన మొదలగు సమస్త ధార్మికవిధులలో, సర్వపారివారిక, సామాజిక కార్యక్రమాలలో, ఈ ధర్మపత్నిని ఎల్లప్పుడూ వెంట ఉంచుకొంటాను. ఈమె యొక్క సరైన అభిప్రాయాలను, సూచనలను, తోడును పరామర్శచేస్తూ సహయోగినిగా గౌరవం నిలుపుతాను" అన్నది.

**ధర్మచారిణీ కోడలా !**

ఈ సందర్భంలో నీవుగూడా నీ పతి అన్ని ధార్మికవిధులలోను, కుటుంబ మరియు సామాజిక కార్యక్రమాలలో సంతోషంగా తోడుంటాననే నిశ్చయాన్ని స్థిరం చేసుకోవాలి.

**ప్రియమైన పుత్రుడా ! ప్రియమైన పుత్రవధూ !**

ఎప్పుడయితే మీరు దృఢమయిన రాయిపై నుంచున్నారో, దాని అర్థం మీరిద్దరూ భగవానుడయిన తథాగతుడు గృహస్థులకు ఉపదేశించిన 38 మంగళధర్మాలనూ, జీవనపర్యంతము దృఢసంకల్పంతో పాటిస్తామని. మరియు పరాభవసుత్తంలో చెప్పినట్లు పతనానికి గల కారణాలన్నింటి నుండి ఎల్లప్పుడూ దూరంగా ఉంటామని. అదేగాక దాని ఇంకో అర్థం ఏమంటే, "మీరిద్దరూ మీ దాంపత్య సంబంధాన్ని రాతిబండలా దృఢంగా ఉంచుకుంటాము" అని. జీవితంలో ఎప్పుడైనా అప్రియమైన అనుకోనిపరిస్థితి తలెత్తినపుడు, మీమనస్సు కొంచెంగూడా చలించదు అని, మీరిద్దరూ ఈవిధంగా దృఢమయిన శిలాఖండంలా అన్ని కష్టాలను, తుఫానులను, భయపడకుండా ఎదుర్కొని విజయం సాధిస్తామని.

**ఓ సౌభాగ్యవతీ !**

నిన్ను అర్ధాంగిగా స్వీకరించి భాగ్యవంతుడయిన వరుడు, ఎప్పుడైతే నీ నుదుట కుంకుమ దిద్దాడో, అప్పుడే నీవు సౌభాగ్యవతిగా ఉండాలని కోరుకున్నాడు. దాని ధార్మిక అర్థము నీవు తెలుసుకోవాలి. అదేమంటే శృంగారాలంకరణలు స్త్రీ సౌభాగ్యానికి ప్రతీకలే కాని ప్రత్యయాలు కావు. ప్రత్యయాలు మంగళధర్మాలే. వాటిని సముచితరీతిలో పాలనచేస్తూ, గృహిణి ఆజన్మాంతము సౌభాగ్యవతిగా ఉంటుంది. ఆమె సుఖసంపదలు నిలిచి ఉంటాయి. అలాగే నీవు కూడా మంగళధర్మాలను పాటిస్తూ నీ సుఖసంపదలను, సౌభాగ్యాన్ని సురక్షితంగా కాపాడుకోవాలి.

**ప్రజ్ఞావంతులయిన నవదంపతులారా!**

మీరిద్దరూ ఏడడుగులు నడిచారు. ఏడడుగులంటే ఏమిటి ? భగవానుడైన తథాగతుడు గృహస్థులకై ఏడు ధన-సంపత్తులను సూచించాడు. ఇవ్వాళ మీరిద్దరూ కలిసి అడుగులువేస్తూ, భుజాలుకలిపి పరస్పరసహకారంతో ఆ ధన-సంపత్తులను సంపాదిస్తామని శుభసంకల్పం చేశారు. ఆ ఏడు ధనసంపత్తులేవనగా–

1. **శ్రద్ధాధనం-** భగవానుడు, అరహంతుడు; సమ్యక్ సంబుద్ధుని పట్ల మీకు అఖండ శ్రద్ధవుండాలి. ఆయన ఉపదేశించిన సనాతన ఆర్యధర్మం మానవ మాత్రులకు కల్యాణకరము. లౌకిక, పారలౌకిక సుఖ-హితకరము. దానికి తోడు లోకోత్తర అమృత పథపు లబ్ధికి సహజ సరళ సాధనము. ఇలాంటి వివేకపూరిత శ్రద్ధాబలంతో మీరిద్దరూ ఈ కల్యాణకరమైన ధర్మాన్ని పాలన చేస్తూ మీ వర్తమానాన్ని మరియు భవిష్యత్తును సంస్కరించుకోండి. ఇదే శ్రద్ధాధనమంటే !

**2. శీలధనము-** మీరిద్దరూ హింస, దొంగతనం, వ్యభిచారం, అసత్యభాషణం, మదిర మొదలగు మత్తు పదార్థ సేవనంపై విరక్తులై ఉందురుగాక!, శీల-ధనమంటే ఇదే!

**3. లజ్జాధనం-** శరీరముతోగాని, వాణితో గాని, మనస్సుతోగాని లేశమాత్రమయినా దుష్కర్మ చేసినపుడు మీరు సిగ్గుపడాలి. ఇదే లజ్జా-ధనమంటే!

**4. పాపభీతి ధనం-** మీరు రాగం, ద్వేషం, మోహం, క్రోధం, శతృత్వం, మోసం, నిర్దయ, ఈర్ష్య, మాత్సర్యము, మాయ, దుర్మార్గము, కఠినత్వము, కలహము, అభిమానం, మదం, నిర్లక్ష్యం మొదలగు దుర్గుణాలకు దూరంగా ఉండాలి. దీనినే పాపభీతి ధనం అని పేర్కొంటారు.

**5. శృతిధనం-** అనేకవిధాలుగా బహుశృతులై మీరు సద్ధర్మజ్ఞానం పొందాలి. పలుమార్లు విని సద్ధర్మజ్ఞానాన్ని సంపాదించుకోవాలి. సద్ధర్మాన్ని గురించిన సమ్యక్ జ్ఞానం ఉండడంవల్ల మీ మనసులలో ఎలాంటి అనుమానాలు, సందేహాలు తలెత్తకుండా పూర్తిగా ఊరడిల్లినవారై, సంపూర్ణ విశ్వాసంతో ధర్మాన్ని ఆచరిస్తూ, దానినుండి లాభాన్వితులు కాగలరు. ఇదే శృతి ధనమంటే !

**6. త్యాగధనము-** కుటుంబ బాధ్యతలను నెరవేరుస్తూ , పిసినారితనాన్ని త్యజించి సత్కార్యాలలో చేతులారా దానమిస్తూ ఉండాలి. ఇదే త్యాగ ధనమంటే !

**7. ప్రజ్ఞాధనం-** సమాధి ద్వారా చిత్త ఏకాగ్రతను అభ్యాసంచేస్తూ ఉండాలి. అంతర్చక్షువును మేల్కొల్పుకొని సంవేదనల రూపంలో ప్రకటితమయ్యే ఉదయ వ్యయములను యథాభూతంగా, ఉన్నవి ఉన్నట్లుగా దర్శించుకుంటూ, ప్రజ్ఞ ద్వారా మనసులోని వికారాలన్నింటి నుండి విముక్తులవుతూ, అన్ని దు:ఖాలనూ హరించి వేసుకోండి. ప్రజ్ఞాధనమంటే ఇదే !

– అఙ్గుత్తరనికాయ 2.7.5-7 విత్థధనసుత్తము.

**ప్రియదంపతులారా !**

మంగళకరమైన ఈ పరిణయశుభవేళలో మీ కర్తవ్య బాధ్యతలను జాగ్రత్తగా అర్థం చేసుకుంటూ, మీరిరువురూ ఇకపైన గృహస్థ ధర్మపాలనకై సర్వదా సన్నద్ధులై ఉండండి. మీరు పాలించే ధర్మం మీ జీవితాంతం మిమ్మల్ని రక్షిస్తుంది. మీ దాంపత్యజీవితాన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది. సుఖ సమృద్ధులతో పరిపూర్ణం చేస్తుంది. దీర్ఘాయుష్మంతులుగా చేస్తుంది. కీర్తి యశస్సులనూ, ధన సంపదలనూ, పుత్రపౌత్రాభివృద్ధినీ కలుగజేస్తూ అమృత పదాన్ని ప్రాప్తింపజేస్తుంది.

మీరిద్దరూ ధర్మవిహారులు కండి ! ధర్మంలో ఆధిక్యత సంపాదించండి ! ధర్మపాలకులు కండి ! ఆదర్శ గృహస్థులు కండి !

**- ఇవే అమ్మానాన్నల ఆశీర్వాదములు**

## కరణీయమెత్త సుత్తము

**(బుద్ధ భగవానుడు మైత్రిని గురించి వివరిస్తూ, మైత్రిఅంటే ఏమిటో ఈ సుత్తము ద్వారా తెలిపాడు.)**

*కరణీయమత్థకుసలేన యన్తసన్తం పదం అభిసమేచ్చ,*
*సక్కో ఉజూ చ సుజూ చ, సువచో చస్స ముదు అనతిమానీ॥*

– తన క్షేమాన్ని సాధించుకోదలచినవాడు, స్వార్థాన్ని సాధించు కోదలచినవాడు, పరమపద నిర్వాణాన్ని పొందదలచుకొన్నవాడు సుయోగ్యుడు కావాలి, సరళుడు కావాలి, అతి సరళుడు కావాలి. సుభాషితుడు కావాలి. మృదుస్వభావి కావాలి. మరియు అభిమాన రహితుడు కావాలి.

*సన్తుస్సకో చ సుభరో చ, అప్పకిచ్చో చ సల్లహుకవుత్తి,*
*సన్తిన్ద్రియో చ నిపకో చ, అప్పగబ్భో కులేస్వననుగిద్ధో॥*

– అతడు సంతుష్టుడై ఉండాలి. ఉన్నదానితో తనపోషణ చేసుకోగలగాలి. దీర్ఘకాలిక యోజనాలలో చిక్కుబడకుండా అల్పకృతుడు కావాలి. స్థోమతకు తగ్గపనులనే చేపట్టాలి. నిరాడంబర జీవితం గడపాలి. ఇంద్రియాలను అదుపులో పెట్టుకుని శాంత ఇంద్రియుడు కావాలి. పరిపక్వుడైన ప్రజ్ఞావంతుడు కావాలి. ప్రగల్భరహితుడు కావాలి. దుస్సాహసాలు చేయకుండా ఉండాలి. జాతి-కులం అనే మిథ్యాభిమానంలో అనురక్తుడు కారాదు.

*న చ ఖుద్దమాచరే కిఞ్చి యేన విఞ్ఞూ పరే ఉపవదేయ్యుం,*
*సుఖినోవ ఖేమినో హోన్తు, సబ్బే సత్తా భవన్తు సుఖితత్తా॥*

– తన గురించి విజ్ఞులు చెడుగా చెప్పుకునే ఏ చిన్న తప్పును గూడా చేయగూడదు. అతడు ఎల్లప్పుడూ తనమనసులో, "ప్రాణులందరూ సుఖంగా ఉండాలి! నిర్భయంగా, క్షేమంగా, ఆత్మసుఖలాభులై ఉండాలి" అని కోరుకుంటూ మైత్రీ భావంలో ఉండాలి.

*యే కేచి పాణభూతత్థి, తసా వా థావరా వనవసేసా,*
*దీఘా వా యే వ మహన్తా, మజ్ఝిమా రస్సకా అణుకథూలా॥*

– "జగత్తులోని ప్రాణులన్నీ- అవి స్థావరములైనా, జంగమములైనా, దీర్ఘదేహధారులైనా, మహా దేహధారులైనా. మధ్యమ దేహధారులైనా, సూక్ష్మదేహధారులైనా, స్థూలదేహధారులైనా,

*దిట్ఠా వా యేవ అదిట్ఠా, యే చ దూరే వసన్తి అవిదూరే,*
*భూతా వా సమ్భవేసీ వా, సబ్బే సత్తా భవన్తు సుఖితత్తా॥*

– అవి దృశ్యప్రాణులైనా, అదృశ్యప్రాణులైనా, దూరంగా ఉన్నవైనా, దగ్గరున్నవైనా, ఇప్పటివరకు పుట్టినవైనా, పుట్టబోయేవైనా, ఎలాంటి భేదం లేకుండా అన్ని ప్రాణులూ ఆత్మ-సుఖలాభులు కావాలి", అన్న మైత్రీభావాన్ని కలిగి ఉండాలి.

*న పరో పరం నికుబ్బేథ, నాతిమఞ్ఞేథ కత్థచి నం కిఞ్చి,*
*బ్యారోసనా పటిఘసఞ్ఞా, నాఞ్ఞమఞ్ఞస్స దుక్ఖమిచ్ఛేయ్య॥*

– వారు పరస్పరం మోసగించుకోరాదు. ఏమాత్రం అవమానపరచు కోరాదు. అగౌరవపరచుకోరాదు. క్రోధవైరాలకు వశీభూతులై, ఒకరిపట్లమరొకరు దుఃఖపడాలని కోరుకోరాదు.

*మాతా యథా నియం పుత్తం, ఆయుసా ఏకపుత్తఅనురక్ఖే,*
*ఏవమ్పి సబ్బభూతేసు, మానసం భావయే అపరిమాణం॥*

– ఏ విధంగా తన ప్రాణాలొడ్డి తల్లి తన ఏకైక పుత్రున్ని రక్షించుకుంటుందో, అలాగే అతడు తన మనస్సులో సకల ప్రాణులపట్ల అపరిమితమైన మైత్రీభావాన్ని పెంచుకోవాలి.

*మెత్తఞ్చ సబ్బలోకస్మిం, మానసం భావయే అపరిమాణం ।*
*ఉద్ధం అధో చ తిరియఞ్చ, అసమ్బాధం అవేరం అసపత్తం ॥*

– ఎటువంటి ఆటంకమూ లేకుండా, ఏ వైరచింతన లేకుండా, ద్రోహచింతన లేకుండా తన మైత్రీభావాన్ని ఊర్ధ్వలోకాలకు, అధోలోకాలకు, తిర్యక్ లోకాలకు సర్వత్రా వ్యాపింప జేయాలి.

*తిట్ఠం చరం నిసిన్నో వా, సయానో వా యావతాస్స విగతమిద్ధో!*
*ఏతం సతిం అధిట్ఠేయ్య, బ్రహ్మమేతం విహారమిధమాహు॥*

– నిల్చొనివున్నా, కూర్చునివున్నా, పడుకొనివున్నా, ఒక్క నిద్రావస్థలో తప్ప అన్ని అవస్థలలోనూ, ఈ అపరిమిత మైత్రీభావనయొక్క జాగరూకతను స్థిరపరుచుకోవాలి, సర్వకాలసర్వావస్థలలో నిరంతరం అభ్యసిస్తూ ఉండాలి. దీనినే భగవానుడు బ్రహ్మ విహారమని పేర్కొన్నాడు.

*దిట్ఠిఇఞ్చ అనుపగ్గమ్మ, సీలవా దస్సనేన సమ్పన్నో!*
*కామేసు వినేయ్య గేధం, న హి జాతు గ్గబ్భ సెయ్యం పునరేతి॥*

ఈ విధంగా బ్రహ్మవిహారంచేసే సాధకుడు, దార్శనిక జంజాటాలలో ఎప్పుడూ ఇరుక్కోడు. అతడు శీలవంతుడు, సమ్యక్ దర్శన సంపన్నుడయిపోతాడు. కామతృష్ణను సంపూర్ణంగా నాశనం చేసుకుంటాడు. "పునరపి జననం, పునరపి మరణం" అనే దుఃఖచక్రం నుండి పూర్ణ విముక్తిని లభింపజేసుకుంటాడు.

– సుత్తనిపాత 143-152, మెత్తసుత్తము.

## పరిశుద్ధదానము

**నా ప్రియమైన సాధకులారా !**

బ్రహ్మవిహారములను అపరిమితంగా అభ్యాసం చేయాలి.

అపరిమిత మైత్రీ బ్రహ్మవిహారము యొక్క అభ్యాసం చేయాలి. అపరిమిత కరుణా బ్రహ్మవిహారం యొక్క అభ్యాసాన్ని చేయాలి. అపరిమిత ముదిత బ్రహ్మవిహారం యొక్క అభ్యాసం చేయాలి. అపరిమిత ఉపేక్షా బ్రహ్మవిహారం యొక్క అభ్యాసం చేయాలి. నాలుగు అపరిమిత బ్రహ్మవిహారాలనూ అభ్యాసంచేయాలి.

ఈ నాలుగు అపరిమిత బ్రహ్మవిహారాల అభ్యాసానికి మహాఫలదాయిని యైన త్రికాల త్రివిధములైన పరిశుద్ధ దానం చేయడం సరళమైన మార్గము.

**అయితే దానము త్రికాల పరిశుద్ధమైనది ఎలా అవుతుంది?**

దాతయొక్క చిత్తం దానమిచ్చుటకు పూర్వం, దానమిచ్చే సమయం లోను, దానమిచ్చిన తరువాత, ఆనంతమైన ప్రీతి ప్రమోదాలతో నిండివుండినపుడు దానం త్రికాల పరిశుద్ధమైనదవుతుంది.

అఙ్గుత్తరనికాయ 2.6.37 ఛళఙ్గదానసుత్తము.

**దానం ఏవిధంగా త్రివిధరూపాలలో పరిశుద్ధమైనదవుతుంది?** దానమిచ్చే దాత శుద్ధశీలసంపన్నుడైనపుడు, దానం తీసుకొనువాడు శుద్ధశీలసంపన్నుడైనపుడు, ఆ దానం చిన్నదైనా, పెద్దదైనా, అది తక్కువ విలువైనదైనా, ఎక్కువ విలువైనదైనా, తన కష్టముతో, న్యాయబద్ధంగా సంపాదించిన దానితో చేసిన దానమే పరిశుద్ధమైన దానమవుతుంది. ఇలాంటి పరిశుద్ధ దానమే త్రివిధ పరిశుద్ధదానమవుతుంది.

త్రికాల త్రివిధ పరిశుద్ధ దానం మహాఫలదాయిని అవుతుంది.

అయితే ఇలాంటి దానం బ్రహ్మ విహారాల అభ్యాసానికి కారణమెలా అవుతుంది ?

దానంగా ఇవ్వబడిన భోజన వసతి సౌకర్యాలు గాని, నిత్యావసర వస్తువులుగాని ఏదోఒక ప్రత్యేక వ్యక్తికోసం కాకుండా సమస్త భిక్షు సంఘం కొరకైనప్పుడు, సమస్త శ్రావక సంఘం కొరకయినప్పుడు, సమస్త సాధక సంఘం కొరకయినప్పుడు, అది సార్వజనీనమై, అందరి హిత సుఖాని కొరకైనప్పుడు ఆ దానం చేసిన వాని చిత్తం, "నా దానం వల్ల అసంఖ్యాకమైన ప్రజలు ఇప్పుడూ లాభం పొందుతున్నారు. భవిష్యత్తులోనూ పొందుతారు; ఇప్పుడూ ధర్మాన్ని పొందుతున్నారు. భవిష్యత్తులోనూ పొందుతారు," అనే చింతనతో అపరిమితమైన మైత్రీభావంతో నిండిపోతుంది. "ప్రపంచంలో ఎంతోమంది దుఃఖిత జనులున్నారు. వారికి ఈ దానంవల్ల దుఃఖవిముక్తి కలుగుతుంది. సుఖలాభం కలుగుతుంది. ధర్మలాభం కలుగుతుంది", ఇలా తెలుసుకుని అతని చిత్తం అపరిమితమైన కరుణాభావంతో నిండిపోతుంది.

"నా ఈ దానంతో ఎంతో మంది సుఖలాభులవుతారు. ధర్మలాభులై, ప్రసన్నులవుతున్నారు. వారికి ఎంతో సుఖసంతోషాలు కలుగుతాయి. వారి జీవితాలు మోదభరితమవుతాయి", అని తెలుసుకొని అతని చిత్తము అపరిమితమైన ముదితతో నిండిపోతుంది.

నా ఈ దానంవల్ల, "నన్ను ఎవరైనా ప్రశంసించినా, నిందించినా, నాకు కీర్తి లభించినా, లేక నేను అపకీర్తి పాలయినా వాటితో నాకు సంబంధంలేదు. నేను చేసిన ఈ దానం నా పేరు ప్రతిష్ఠలకు గానీ, యశః కీర్తులకు గానీ, మానసమ్మానాలకు గానీ కాదు. శుద్ధ ధర్మచేతనతో ఇస్తున్న ఈ దానం ఇతరుల హితానికి ఉపయోగపడితే చాలు. అంతే!" అనే ఉపేక్షాభావంతో అతని మనస్సు నిండిపోతుంది.

సాధకులారా! ఈవిధమైన పరిశుద్ధదానం ద్వారా, నాలుగు బ్రహ్మవిహారాల అభ్యాసము చేయబడుతుంది.

సాధకులారా! మీరు అపరిమితంగా బ్రహ్మవిహారాల అభ్యాసం చేయాలి.

అపరిమిత బ్రహ్మవిహారాల అభ్యాసం మనకు ఎంతో శుభం చేస్తుంది. ఎంతో మేలు చేస్తుంది.

## దానము

19 జనవరి 1972 న పరమపూజ్య గురుదేవుడు ఊ బా ఖిన్ గారి ప్రథమ పుణ్యతిథిని పురస్కరించుకుని, పరమపావనమైన బోధగయలో గొప్ప దానయజ్ఞం తలపెట్టడం జరిగింది. అప్పుడు రెండు ధర్మయజ్ఞాలను భారీఎత్తున నిర్వహించడం జరిగింది. అన్ని దానాలలోకి శ్రేష్ఠమైనది, మహోన్నతమైన అత్యంత ఉత్తమమైనదానం ధర్మ దానం. దానికితోడుగా "ఆమిషదానం" అనగా భోజన, వస్త్ర, ధనదానం ఇంకా ఇతర ఆవశ్యకవస్తువుల దానయజ్ఞం గూడా నిర్వహించబడినది. దానివల్ల దేశ దేశాలవారు ఎంతోమంది ధర్మలాభాన్ని పొందారు. ఈ దానయజ్ఞానికి సమస్త భారతదేశం నుండి వయోవృద్ధులు, భిక్షువులు శ్రమణులు, బ్రాహ్మణులు వచ్చారు. శ్రద్ధాళులైన దాతలకు దానముయొక్క అపూర్వపుణ్యాన్ని గడించుకునే శుభావకాశాన్నిచ్చారు. దూరంగానున్న అస్సాం, కలకత్తా, నాగపూరు, లుంబిని, ఖాట్మండు, ఇటావా, వారణాసి, నలందాల నుండి వచ్చిన విద్వాంసులు, తపస్సంపన్నులగు స్థవిరులు (బౌద్ధ భిక్షువులు), మహాస్థవిరులు దానం స్వీకరించి దాతలను అనుగ్రహించారు. ధర్మాన్ని అర్థంచేసుకోడానికి, అర్థం చేయించడానికి తమ జీవితాలను అంకితం చేసుకున్న గొప్ప గొప్ప మహా శ్రమణులు వచ్చారు. గ్రహీత ఎంత గొప్పవాడయితే, దాతకు ప్రాప్తించే పుణ్యంగూడా అంత ఫలదాయని అవుతుంది. భూమి సారవంతమైనది అయినప్పుడు అందులో నాటిన విత్తనం గూడా మంచి ఫలాల్నే ఇస్తుంది. అంతేకాకుండా, బోధగయలోని వేలాది మంది ప్రజలకు భోజన వస్త్ర

దానం చేశారు. అనేక సాధకులు ఈ బృహత్ దానయజ్ఞంలో ధర్మచేతనతో పాల్గొన్నారు. ధర్మవంతమైన చేతనతో (మనసుతో) ఇచ్చిన దానమే శుద్ధదానమవుతుంది. దానం యొక్క మహాఫలం, రకరకాల మనోవికారాలవల్ల రోగగ్రస్తంగామారిన మన చిత్తానికి స్వస్థత చేకూరుస్తుంది. దానిని ఆరోగ్యవంతంగా తయారుచేస్తుంది. పిసినారి తనం, కఠోరత, కుటిలత్వం, స్వార్థం, సంకుచితత్వం, నీరసత్వంతో నిండివున్న చిత్తాన్ని, ఉదార, మృదుల, కోమల, సౌమ్య, విశాల పారమార్థికభావాలతో మనోహరంగా తయారు చేస్తుంది. ఇదే చిత్తస్వస్థత. ఇదే ఆరోగ్యవంతమైన చిత్తం.

**దానం చేయడం గృహస్థ ధర్మానికి పునాది.** మన దేశపు ప్రాచీన ధార్మిక పరంపరలో దానానికి విశిష్టమైన స్థానముంది. పూర్వకాలంలో ధనసంపన్నులైన గృహస్థులందరూ గొప్ప గొప్ప దాన-యజ్ఞాలు నిర్వహించేవారు. పురాతన యుగంలో సద్గృహస్థులైన ఋషులు - మహర్షులైన అష్టకుడు, వామకుడు, వామదేవుడు, విశ్వామిత్రుడు, జమదగ్ని, అంగీరసుడు, భరద్వాజుడు, వశిష్ఠుడు, కశ్యపుడు లాంటివారు దానంయొక్క మహాయజ్ఞాలు చేస్తూ, చేయిస్తూ వచ్చారు. పూర్వకాలంలో వైస్సంతర మహారాజు, ఆ తరువాతి కాలంలో హర్ష చక్రవర్తిలాంటి మహాదాతలు సర్వస్వం దానం చేసే ఆదర్శాన్ని నిలబెట్టారు. కర్ణహరిశ్చంద్రుల దానాలు ఎంతో ప్రసిద్ధి చెందినవి. వారి దానచేతనలు బహుఉదాత్తమైనవి. అందరి దానచేతన గూడా అంతే ఉదాత్తంగా ఉండాలి. నిర్మలమై ఉండాలి. సమాజపు ప్రత్యేక వ్యవస్థ కారణంగా ప్రజల ధనం రాజులవద్ద, ధనికుల వద్ద సంగ్రహింపబడి ఉండేది. ఇలా ధనం ఒకచోటనే సంగ్రహమై, పారని నదిలోని నీటిలా కుళ్లి పోకుండా, రాజ్యాన్ని అనారోగ్యంపాలు చేయకుండా, పారేనదిలో నీరు వస్తూ పోతూ ఉన్నట్లే, ఈ ధనంగూడా నిర్మలంగా ఉండేలా దానమిచ్చేవారు. అనుచితమైన పరిగ్రహదోషంనుండి విముక్తి పొందడానికి తాము సంగ్రహించిన ధనాన్ని రాష్ట్ర సంపద అని తెలుసుకొని, 'సంవిభాగం' చేసి అందరూ అనుభవించేలా దానంచేసేవారు. ఈవిధమైన సమత్వబుద్ధి, సామ్యబుద్ధి, సమాజపు సమృద్ధియొక్క సమతుల్యతకు భంగం కలగకుండా కాపాడేది. విషమపరిస్థితులు రాకుండా కాపాడేది. సంపన్నుడైన దాత తన ధర్మబుద్ధితో, కర్తవ్యబుద్ధితో అప్పుడప్పుడు తన ధనాన్ని "సంవిభాగము" చేస్తూ ఉండేవాడు. బదులుగా ఏదో ఆశించి కాదు. ఇతరులను తక్కువగా చూపించి తన అహంభావాన్ని ప్రదర్శించుకోడానికికాదు. దానం మహత్వము ఇదే. దానం శుద్ధత ఇదే!

*విచేయ్య దానం దాతబ్బం యత్థ దిన్నం మహప్ఫలం।*

- ధర్మబుద్ధితో జాగ్రత్తగా ఆలోచించి, అర్థం చేసుకునిచేసే శుద్ధమైన దానం మహాఫలదాయిని అవుతుంది.

- ధమ్మపద అట్ఠకథ 2.180 దేవోరోహణవత్థు

కాబట్టి మనంగూడా ధర్మబుద్ధితో ఆలోచించి అర్థం చేసుకుని మాత్రమే దానం చేయడం నేర్చుకోవాలి.

దానాలు రెండు విధాలుగా ఉంటాయి.

1. **వట్టమూలక దానం -** ఇది భవచక్రవలయంలో చిక్కుకుపోయేలా ఉంచే దానం.
2. **వివట్టమూలక దానం -** ఇది భవచక్రమునుండి బయటపడవేసే దానం. నిజమైన ధర్మచేతనగల వ్యక్తి భవచక్రము నుండి విముక్తి కలిగించేటటువంటి దానమే చేస్తాడు. భవచక్రములో బంధింపచేసే దానం చేయడు.

-మజ్జిమనికాయ అట్ఠకథ 2.407 మహాతణ్హా సఙ్ఖయ సుత్త వణ్ణాన

ఇతర అన్ని కర్మలలాగానే, దానకర్మ గూడా చిత్త చేతనను బట్టి మూల్యాంకనం చేయబడుతుంది. చిత్తచేతన ఎలా ఉంటుందో, దాని కర్మబీజంగూడా అలాంటిదే అవుతుంది. దానినసుసరించి ప్రకృతి తన ఫలాన్నిస్తుంది. భవచక్రాన్నుంచి వేరుచేసే వివట్టమూలక చిత్తం, రాగవిహీనమై, ద్వేషవిహీనమై, మోహవిహీనమై ఉంటుంది. ఇలాంటి చిత్తంతో చేయబడిన దానం వివట్టమూలకదానం అవుతుంది. లోకచక్రాన్ని తునాతునకలు చేసేదవుతుంది. ఇలా దానం చేయడంలో మనం కించిత్ స్వార్థం కూడా చూడము. దానం పొందువాని సుఖం, హితం చూసి మురిసిపోతాం. ఎప్పుడైతే మనం ఇతరుల మోదం వల్ల ముదితులమౌతామో అప్పుడు మన చిత్తం నిర్మలమవుతుంది. మృదులమవుతుంది. స్వార్థపూరితమైన సంకుచితత్వంనుంచి, కాఠిన్యంనుంచి ముక్తి పొందుతుంది.

లౌకీయదానం చేస్తూ ఎప్పుడైతే స్వహితమునకై ఏదైనా ఫలితాన్ని ఆశించినట్లయితే, ఆ రాగరంజితమైన చిత్తం వట్టమూలకమౌతుంది. భవచక్రంలో పడవేసేదవుతుంది. దానానికి ప్రతిఫలంగా లౌకిక సుఖవైభవాలను కోరినట్లయితే, కీర్తిని ఆశించినట్లయితే, గౌరవ సత్కారాలను కోరితే, లాభసత్కారాలనాశిస్తే, స్వర్గ భోగాలనాశిస్తే, ఈ కామరంజితమైన వాసనలచే కప్పబడిన చిత్తం బంధనంలో కట్టిపడేసే దవుతుందేగాని, బంధవిముక్తిని పొందదు. ఈ దానం యొక్క ఫలం బంధించునదే అవుతుంది గానీ, బంధవిముక్తిగావించేది కానేరదు.

అనగా, రాగరంజితమైన చిత్తముతో దానం చేయడం తప్పు. దానికంటే ఘోరం ద్వేషదూషిత చిత్తంతో దానం చేయడం. ఇది మనకు మరీ అనర్థదాయకమౌతుంది. ధర్మమనే పేరుతో పాపం తెచ్చుకొనే పనైకూర్చుంటుంది. ఇచ్చిన ధనాన్ని ఎలాగూ పోగొట్టు కుంటాం. దానికితోడు అకుశల చిత్తంతో చేసినపని మన అమంగళా నికి, అకుశలానికి కారణమవుతుంది. దీనిని ఉదాహరణలతో తెలుసుకుందాం. మనం దోషచిత్తంతో దానం ఎలా చేస్తుంటామో చూద్దాం.

ఒక బిచ్చగాడు నా వాకిలి ముందు నిల్చొని "బాబూ ధర్మం చెయ్యండి, డబ్బు లివ్వండి" అని యాచిస్తుంటాడు. నేను వాని అరుపులకు విసిగిపోయి ఒక రూపాయి బిళ్ళ విసిరేస్తాను, పీడ విరగడ కానీమని, అప్పుడు నా మనసులో క్రోధం, ఏవగింపు నిండి ఉంటుంది.

కొంతమంది ఏదో స్కూలు పెడతామని, ఆసుపత్రి కట్టిస్తామని నా దుకాణం వద్దకు చందాకి వస్తే, నేను వాళ్ళను చూసి చిటపటాయిస్తూ "ఛీ! ఛీ! ఎప్పుడు చూసినా చందాలే!" అని ఆక్రోశిస్తూ, "ఒక వంద రూపాయలు పడెయ్యి , పీడవిరగడవుద్ది", అని లెక్కలు వ్రాసే వాడికి చెప్పి గొణుక్కుంటాను. అపుడు నా మనసు రూపాయలిస్తూ, ఆక్రోశిస్తూ వుండి వ్యాకులమై ఉంటుంది.

ఎవరైనా మంత్రిగారు నన్ను పిలిపించి పార్టీ ఫండుకని చందా ఇమ్మంటే నాకు ఇష్టం లేకున్నా అతనంటే భయంతో, ఇవ్వకపోతే రేపు లైసెన్సు ఇవ్వడనీ, నన్ను దేంట్లోనో ఇరికించి నా వ్యాపారాన్ని నాశనం చేస్తాడనే భయంతో దానంచేస్తాను. నా ప్రియస్నేహితుడు ఫలానా పనికై నీ దానం కావాలని కబురు పంపాడు. నాకిష్టం లేక పోయినా మొహమాటానికి దానం చేస్తాను.

నా అన్నదమ్ములు ఏదో కార్యానికి దానంచేశారు. ఆ కార్యానికి దానమివ్వడం నాకు అసలు ఇష్టం లేదు. కానీ, 'అందరూ ఏమనుకుంటారో నా పరువు పోతుంది. లోకులు నన్ను నిందిస్తారు,' అనేభయంతో దానంచేస్తాను. నా ప్రత్యర్థి ఏదో కార్యానికి దానం ఇచ్చాడు. అది నాకు తెలిసి ఒళ్ళు మండిపోయింది. వాడి కీర్తి పెరిగి పోయిందే అని నేను వాడికంటే ఎక్కువదానం చేస్తాను అహంకారంతో.

ఈవిధంగా, విసుగు, ఏవగింపు, కోపం, భయం, మొహమాటం, సంకోచం, ప్రతిస్పర్ధ, ఈర్ష్య, శతృత్వం, దర్పం, అభిమానం మొదలగు దుర్మనోచేతనలతో దానం చేసి, తరువాత గుర్తుచేసుకుని పశ్చాత్తాప పడతాను. మనసును మలినం చేసుకొంటాను. అయితే ఈ దుర్మనశ్చేతనతో చేసిన దానం హానికారకమే గాక నా అమంగళానికి, అహితానికి గూడా కారణమవుతుంది.

ధర్మచేతనతో చేసినటువంటి పనులన్నీ మంగళకారులే అవుతాయి. అధర్మచేతనచే చేసినటువంటి పనులన్నీ అమంగళకర ములే అవుతాయి. ధర్మచేతనచే ఇచ్చిన దానం మంగళకరమవు తుంది. అందువల్ల ఎల్లపుడూ ధర్మచేతనతో మాత్రమే దానమివ్వండి. ధర్మచేతనచే ఇచ్చిన దానంతో చిత్తం త్యాగభావంతో నిండి ఉంటుంది. పరహితం, పరసుఖముల ఆనందంతో నిండి ఉంటుంది. త్రైకాలిక ప్రసన్నతతో నిండి ఉంటుంది.

దానమిచ్చేముందు మనసులో 'నేను దానం ఇస్తాను', అనే ఆనంద భరితమైన భావాలు పుడుతుంటాయి. 'నా దానం వల్ల ఎంతో మందికి మేలు జరుగుతుంది. ఎంతో మందికి కల్యాణకారక మవుతుంది'. అలా దానమిచ్చేటపుడు గూడా మనసులో, 'నేను దానిమిస్తున్నాను', అనే ఆనందమైన భావంలో మనసు మునిగి తేలుతూ ఉంటుంది. 'గృహస్థధర్మాన్ని పాలన చేస్తున్నాను. నా ఈ దానంతో ఎంతో సుఖం, హితం కలుగుతుంది', అని. దానమిచ్చిన తరువాత కూడా నా మనస్సులో 'నేను ఉత్తమమయిన భోజనం పెట్టాను; దాన్ని భుజించీ, నేను శ్రేష్ఠమయిన వస్త్రాలు దానమిచ్చాను, వాటిని ధరించీ; నేను అద్భుతమయిన మందు దానమిచ్చాను, దానిని సేవించీ; దాన గ్రహీత శరీరముతో, మనసుతో స్వస్థ సబలుడై, శీల-సమాధి-ప్రజ్ఞల అభ్యాసం చేసి తన మంగళాన్ని సాధించు కొంటాడు. ఇంకా అనేకుల మంగళానికి కారణమవుతాడు. నేను ఈ కుటీరాన్ని దానం చేసాను. దీనిలో ఉంటూ సాధకులు శీల-సమాధి-ప్రజ్ఞల అభ్యాసం చేస్తారు. సమత మరియు విపశ్యనధ్యాన సాధనాభ్యాసము చేసి నిర్వాణం యొక్క సుఖశాంతులను ఆస్వాదిస్తారు. ఎంతో మంది సుఖ-శాంతులకు కారణమవుతారు. నా దానగ్రహీత ఎవరైనా జీవన్ముక్తుడై అరహంతుడైనా, అరహంతుడి మార్గాన నడిచే వాడైనా, ధర్మభావ సత్పురుషుడైనాగూడా నా మనసు హద్దులెరుగని అమిత ఆహ్లాదంతో నిండిపోతుంది. "ఓహో ! ఏమి నా సౌభాగ్యం! నేనిచ్చిన దానం వలన ఇలాంటి సత్పురుషుడు అధిక కాలం వరకు సబలుడై, స్వస్థుడై జీవిస్తాడు. ఇతని వల్ల ఎంతో మందికి మేలు జరుగుతుంది. ఇతను నా దానం స్వీకరించటంద్వారా నాపై ఎనలేని దయ చూపించాడు." అని మనసులో ఎల్లప్పుడూ ఇలాంటి శుభకరమైన భావాలే ఓలలాడుతూ ఉంటాయి.

ఈవిధంగా దానమివ్వడానికి ముందు, ఇచ్చేటప్పుడూ, దానమిచ్చిన తరువాత గూడా దాత తన మనస్సును ఆనందంతో నింపుకుంటాడు. మరియు దానిని మృదుమనోహరంగా మార్చుకుంటాడు.

***పుబ్బేవ దానా సుమనో హోతి, దదం చిత్తం పసీదయే।***
***దత్వా అత్తమనో హోతి, ఏసా యఞ్ఞస్స సమ్పదా॥***

అఙ్గుత్తరనికాయ, 2,6.37 ఛళఙ్గదానసుత్తము.

– దానమిచ్చేవాడు ఇచ్చే ముందూ సుమనుడవుతాడు; దానమిస్తూ చిత్తాన్ని ప్రసన్నతతో నింపుకుంటాడు, మరియు దానమిచ్చిన తరువాత గూడా చిత్తాన్ని మోదమయం చేసుకుంటాడు. ధర్మచేతనా భరితమైన దానయజ్ఞము యొక్క సుఖసంపద ఇలా ఉంటుంది.

(తరువాయి వచ్చే సంచికలో)

**ధమ్మకౌండిన్య -కొండాపూర్**

జూన్ మాసం నుండి ప్రతినెల 3 నుండి14 వరకు 10 రోజుల శిబిరాలు జరుగుతాయి. (ప్రస్తుతం కేవలం పురుషులకు మాత్రమే)

**నూతన నియామకాలు - బాధ్యతలు**

1. శ్రీ అల్ల మోహన్‌రాజ్‌గారు, **ఆచార్యులు** (ధమ్మనాగార్జున కేంద్ర బాధ్యత)
2. శ్రీ రామ్ స్వరూప్ బ్రహ్మచారి గారు, **ఆచార్యులు** (ధమ్మవిజయ కేంద్ర బాధ్యత)
3. శ్రీమతి సబ్రీనా కటకమ్ గారు, **ఆచార్యులు** (దక్షిణ భారత సహాయక ఆచార్యుల శిక్షణా బాధ్యత)
4. శ్రీ రవికుమార్ రెడ్డి (వరిష్ఠ సహాయక ఆచార్యులు) గారు శ్రీయుతులు బాలక్రిష్ణ గోయెంకా (BKG) (ఆచార్యులు దక్షిణ భారత కేంద్రముల ఇన్‌ఛార్జి) గారికి సహాయకులుగా బాధ్యత నిర్వహిస్తారు.

**సహాయక ఆచార్యులు**

1. శ్రీ నరోత్తమ్ రెడ్డి గారు, (హైద్రాబాదు) మరియు 2. శ్రీమతి నిర్మలాదత్ గారు (హైద్రాబాద్) సహాయక ఆచార్యులుగా నియమించబడ్డారు.

**తెలుగు పత్రిక సంవత్సరపుచందా పూర్తి అయిన సాధకులు రూ. 50 ఈ క్రింది చిరునామాకు పంపి పత్రికను పొందగలరు.**

**విపశ్యన తెలుగు మాసపత్రిక,**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - 500 070. ఫోన్ : 24240290 (ఆశ్రమం).**

***(ఆఫీసు పనిచేయు వేళలు : ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు)***

**PRINTED MATTER**

TO

If Underlivered please return to:
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/3KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.

Published for Vipassana International Meditation Centre, 12/3 KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd. (A.P) -70. Ph : 040-24240290. Published by Smt. Sabrina Katakam. Editor : Sri O. Premanand. Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 23325979. RNI No. APTEL/2006/17745